తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మంటల్లో చిక్కుకుని వ్యక్తి మృతి

సదుం,ఫిబ్రవరి13ప్రభాతవార్త

మండల పరిదిలో ఓ వ్యక్తి ప్రమాద వశాత్తు మంటల్లో చిక్కుకుని మృతి చెందిన సంఘటన జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు యర్రాతివారివారిపల్లె పంచాయతీ గొడ్లవారిపల్లెకు చెందిన మద్దిరాళ్ల వెంకటప్ప సదుంలో షామియానా షాపు నిర్వహిస్తున్నాడు.ప్రతి రోజు గొడ్లవారిపల్లెకు వెళ్లి పొలాల వద్దకు పోయి తిరిగి వచ్చేవాడు. రోజువారి పనుల్లో బాగంగా సోమవారం తనమామిడి తోటలో చెత్తాచెదారం పోగుచేసి నిప్పుపెట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈక్రమంలో మంటలు చుట్టుముట్టి మంటల్లో కాలిపోయి మృతి చెందాడు. మృతుడికి 65సంవత్సరాలు ఉంటుంది. మాజీసర్పంచి ధనశేఖరరెడ్డి,సదుంఎస్సై మారుతిలు పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సాంప్రదాయ కళల పోషణకు కృషి

### -కలంకారీ కోర్సులో చేరే విద్యార్థులకు రూ.లక్ష డిపాజిట్!

### : టిటిడి ఇఒ ధర్మారెడ్డి

తిరుమల,ఫిబ్రవరి 13ప్రభాతవార్తప్రతినిధి:

అంతరించిపోతున్న శిల్పకళ సాంప్రదాయ సంగీత, నృత్యకళలను పోషించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం కృషి చేస్తోందని టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. శిల్పకళాశాల నిర్వహణ, పరిసరాల వాతావరణం చక్కగా ఉందని అధ్యాపకులను, విద్యార్థులను ఇఒ అభినందించారు. శిల్పకళాశాల విద్యార్థులు తయారుచేసిన ఆలయ నిర్మాణం, శిల్ప,సుధా,దారు,లోహ శిల్పాలు,సాంప్రదాయ వర్ణచిత్రాలు,కలంకారీ చిత్రాలను ఇఒ ధర్మారెడ్డి, జెఇఒ సదాభార్గవి, డిఇఒ భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డితో కలసి పరిశీలించారు. విద్యార్థుల అద్భుత నైపుణ్యాన్ని అభినందించారు.

## నగరిని దోచేస్తున్న రోజా

### మంత్రులపై విరుచుకుపడ్డ లోకేష్

బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

పుత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :

చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్.కె.రోజాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో భాగంగా సోమవారం పుత్తూరులోని చినరాజుకుప్పం వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఇద్దరు మంత్రులపై విరుచుకుపడ్డారు. తీవ్ర, పరుష పదజాలతో ఇద్దరికీ ఘాటుగా విమర్శించారు. పెద్దిరెడ్డి కంటే రోజాను వ్యంగంగా కామెంట్ చేశారు. ముఖ్యమంత్రి జగనో మోహనరెడ్డి ఒక సైకో అని ఆ మేరకు రాష్ట్రంలో ఒకొక్క జిల్లాకు ఒకొక్క సైకోను ఆయన తయారుచేస్తున్నారని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో విద్యుత్, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక సైకోలా వ్యవహరిస్తున్నారన్నారు. ఎర్రచందనం, ఇసుక, గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. రోజా నగరికి రాకముందు ఆమె పరిస్థితి, ఇక్కడి ప్రజల పరిస్థితి ఎలా వుందో...ఆమె ఎమ్మెల్యే, మంత్రి అయిన తర్వాత పరిస్థితుల్లో ఎంత మార్పు వచ్చిందో నగరి ప్రజలకు బాగా తెలుసునన్నారు. నియోజకవర్గంలోని అయిదు మండలాలను తన అన్నదమ్ములు కుమారస్వామిరెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, భర్త సెల్వమణి తమ్ముడికి పంచేశారన్నారు. ఈ ప్రాంతాల్లో వారు భూఆక్రమణలు, ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా చేస్తూ ధనార్జన చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల నగరిలో గంజాయి విక్రయాలు కూడా మితిమీరాయన్నారు. విజయపురం మండలంలోని పాతార్కాడులో గ్రావెల్ క్వారీ నుంచి అక్రమంగా ఒక రోజుకు 150 టిప్పర్ల గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారని తెలిపారు. వడమాలపేటలోని పాదిరేడులో 400 ఎకరాల భూసేకరణలో లబ్దిదారులను వాటాలు అడుగుతున్నారన్నారు. భూకబ్జాలను కూడా జబర్దస్తీగా చేస్తున్నారని వడమాలపేట టోల్‌గేట్ వద్ద 55 ఎకరాలు, విజయపురం మండలంలోని కోసలనగరంలో 35 ఎకరాలు, విశాఖలో రుషికొండ వద్ద ఒక ఎకరం స్థలాలను కబ్జా చేశారని విమర్శించారు. ఆస్ట్రేలియా, సింగపూర్ టూర్లపై కంటే నగరిలో మరమగ్గాల కార్మికులపై శ్రద్ధ పెడితే వారి జీవన స్థితి,గతులు బాగుపడి వుంటాయని పేర్కొన్నారు.

**నగరిని రాబందుల్లా దోచుకుంటున్నారు : గాలి భానుప్రకాష్**

నగరి నియోజకవర్గాన్ని మంత్రి ఆర్.కె.రోజా ఆమె బంధువులు రాబంధుల్లా దోచుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ ఆరోపించారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఇసుక, గంజాయి, గ్రావెల్, లిక్కర్ మాఫీయాలు నగరిలో చెలరేగిపోతున్నాయన్నారు. మూడున్నర ఏళ్ల వైకాపా పాలన వల్ల రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. పేదల కన్నీరు తుడిచేందుకు, యువతకు భరోసా కల్పించేందుకు నారా లోకేష్ యువగళం పాదయాత్రను చేపట్టారన్నారు.

### నగరిపై హామీల వర్షం

నగరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హామీల వర్షం కురిపించారు. సోమవారం పుత్తూరులో జరిగిన యువగళం పాదయాత్రలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే గాలేరు-నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారు. నగరి నియోజకవర్గంలో ఎపిఐఐసి ద్వారా పారిశ్రామిక పార్క్ నెలకొల్పి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. పుత్తూరు, నగరిలో వుండే మరమగ్గాల యూనిట్లకు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. నియోజకవర్గంలో అగ్నికుల క్షత్రియులకు కుల ధృవీకరణ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. గత మూడున్నర ఏళ్లలో పుత్తూరులోని వేణుగోపాలసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణం ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేదన్నారు.

## మానవ హక్కుల కమిషన్ సూచించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వండి -కలెక్టర్

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

జాతీయ మానవ హక్కుల కమీషన్ సూచన మేరకు త్రాగునీటి, విద్యుత్, రోడ్డులు తదితర పనులను పూర్తి చేసి, ఇప్పటికే చేపట్టిన పనుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జాతీయ హక్కుల కమీషన్‌కు నివేదిక అందించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేసారు. ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల కమీషన్ నుండి గూడూరు, సూళ్ళూరుపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలో రోడ్ల మరమ్మత్తులు, కొత్త రోడ్ల నిర్మాణాలు ఇప్పటికే చేపట్టామని, త్రాగునీటికి సంబంధించి 3 కిలోమీటర్ల పైప్‌లైన్, ఫారెస్ట్ పరిధిలో 3ఫేస్ ఎలక్ట్రిక్ లైన్ ఏర్పాటు, రెండు చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు, చెరువులలో పూడికతీత పనులకు సంబంధించి అంఛనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేధించాలని సూచించారు. జిల్లా కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమీక్షలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, సూళ్ళూరుపేట ఆర్‌డిఓ చంద్రముని, షార్ సూళ్ళూరుపేట డివిజన్ ఫారెస్ట్ అధికారులు, ఇరిగేషన్ పంచాయతీరాజ్, ఆర్.డి.బి, ఎ.పి.ఎస్.పి.డి.సి.ఎల్ అధికారులు, వాకాడు డి.వి.సత్రం, తడ, సూళ్ళూరుపేట, చిట్టమూరు తహశీల్దార్స్ హాజరయ్యారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

### తొలిపూజలు కన్నప్పకు

(శ్రీకాళహస్తి, ప్రభాతవార్త)

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అంగరంగ వైభవంగా భక్తకన్నప్ప ధ్వజారోహణం జరిగింది.ఇక్కడి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాల్ని నిర్వహించటం ఆనవాయితిగా వస్తుంది. సాధారణంగా ఏ ప్రాంతంలో అయినా వార్షిక బ్రహ్మోత్సవాల్ని పదిరోజుల పాటు నిర్వహించటం ఆనవాయితి కానీ శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు బ్రహ్మోత్సవాల్ని నిర్వహించటం జరుగుతుంది.మొదటి పూజను భోళాశంకరుడు తనను మూఢభక్తితో ఆరాధించి తన కళ్ళను సైతం ఇవ్వటానికి సిద్ధపడ్డ భక్తుడు తిన్నడు అనే కన్నప్పకు అవకాశం కల్పించి భక్తుల పట్ల తనకు గల గుర్తింపుకు నిదర్శనంగా నిలిచారు.సోమవారం మధ్యాహ్నం ఆలయంలో భక్తకన్నప్పను ఎంతోచక్కగా రాజేష్‌గురుకుల్ అలంకరించగా బోయిలు మేళ తాళాలు మంగళవాయిద్యాలతో మోసుకుంటూ కొండపైకి వెళ్ళారు. కొండపై పురాతన కాలం నాటి భక్తకన్నప్ప గుడి వద్ద ప్రతిష్టించి ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ కలశాన్ని ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అక్కడ నుంచి పూజల్ని ధ్వజస్థంభం వద్దకు చేర్చారు. ఇక్కడ బలిముద్దల్ని ఏర్పాటు చేశారు.ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్ సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తుండగా పౌరోహితులు, వేదపండితులు అర్థగిరి సారథ్యంలో నాలుగువేదాల్ని పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు స్వామినాథన్ గురుకుల్ పూజలు జరిపారు. ధ్వజస్థంభంపై దేవస్థానం సమర్పించిన వస్త్రాన్ని ఆధిరోహింపజేసి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం హారతులు ఆఖండ హారతులిచ్చారు.నైవేద్యం సమర్పించారు.

భక్తులు హర హర మహాదేవ శంభోశంకరా అంటూ నినాదాలు ఇస్తుండగా ధ్వజారోహణం జరిపారు. హారతులు, అఖండ హారతులిచ్చారు. ఎదురుగా ఉన్న ఈశ్వరలింగానికి హారతులిచ్చారు. తరువాత తేవారం పండితుడు ముత్తుకుమార్‌స్వామి పఠనంతో కార్యక్రమాలు ముగిసాయి.

**ఆలయంలో పూజలు:**

కొండపై వెలసిన భక్తకన్నప్ప విగ్రహానికి పూజలు,నైవేద్యం, హారతులిచ్చారు.అక్కడ నుంచి కొండపై నుంచి అష్టదిక్పాలకులకు, ముక్కోటిదేవతలకు ఆహ్వానం పలికారు.ఈ కార్యక్రమాలకు విశేష సంఖ్యలో పట్టణానికి చెందిన వేలాది మహిళలు హాజరయ్యారు. అలాగే అతిథులు కూడా విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వికె సాగర్‌బాబు,డెప్యూటీ ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి ఇఇ మురళీధర్‌రెడ్డి, నవభారత్ యువజనసంఘం అధ్యక్షులు గరికపాటిరమేష్‌బాబు, ఎఇఒ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు సుదర్శనం, హరియాదవ్ తదితరులు హాజరయ్యారు.

భక్తకన్నప్ప ఊరేగింపు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రమ్మోత్సవాలు సందర్భంగా మొదటి పూజలు అందుకున్న భక్తకన్నప్పపట్టణంలో ఊరేగింపు జరిపారు. ఊరేగింపుకు ముందు ప్రత్యేక గొడుగులు వెళుతుండగా వెనుకగా కోలాటాలు ఎంతో ఆకర్షించాయి. చెక్కభజనలు,మేళతాళాలు,మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు,వేదపండితుల వేద ఘోషతో ఊరేగింపు త్రినేత్ర అతిథి గృహం, సన్నిధివీధి, తేరువీధి, బజారువీధి, నగరి వీధి,నెహ్రూ వీధుల గుండా సాగింది. ఆలయాధికారులు పాల్గొన్నారు.

## ముత్యపు పందిరిపై మూలపురుషుడు

చంద్రగిరి,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

ముత్యపు పందిరిపై మూలపురుషుడైన శ్రీనివాసుడు శ్రీదేవి భూదేవి సమేతుడై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నిర్మలమైన కాంతులకు మూలాధారం ముత్యాలు, ఆ ముత్యాల కాంతులలో దేదీప్యమానంగా వెలుగొందుతున్న స్వామి వారిని దర్శించుకునేందుకు రాత్రి వేళ అనుకూలమైనందున మూడవరోజున రాత్రి భగవంతుడు ముత్యపు పందిరిలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ప్రధా అర్చకులు బాలాజీ రంగాచార్యులు వాహన విశేషాన్ని వివరిస్తూ ముత్యం స్వచ్ఛతకు సంకేతంగా నిలుస్తుందన్నారు. మనిషి ఆత్మ ఎన్నో జన్మల అనంతరం విశ్వలోకాల నుండి దుర్లభమైన మానవజన్మను సంతరించుకుంటుంది. మాంసమయమైన ఈ శరీరాన్ని ఆధ్యాత్మిక సంపదతో శుద్ధి చేసుకుంటే బుద్ధి ముత్యంవలె మారి జనన, మరణ, చక్రం నుండి విడుదలై మోక్షాన్ని పొందుతుందన్నారు. ఈ విధంగా స్వామివారికి మిక్కిలి ప్రీతిపాత్రమైన ముత్యాలహారాలు, రత్నాల వల్ల కలిగే వేడిమిని, పుష్పాల వలన లభించే సుగంధాన్ని తమలో ఇముడ్చుకుని స్వామి వారి వక్షస్థలానికి, అక్కడి నుండి లక్ష్మీదేవికి సమశీతోష్ణస్థితిని చేకూరుస్తూ, తాపగుణాన్ని హరిస్తూ, ఉత్సాహాన్ని, ప్రశాంతతను చేకూర్చుతున్నట్లు తెలిపారు. అట్టి ముత్యపు పందిరి వాహనసేవలో స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా భక్తుల ఈతి భాధలు తీరి ప్రశాంతత పొందగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ టి.వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు పార్థసారథి, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలు భారీ చోరి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

వరదయ్యపాళెం మండలం వీరాస్వామి నగర్‌లో పట్టపగలు దొంగలు స్వైరవిహారం చేసారు. సుమారు 20 సవరాల నగలు, సుమారు రూ.2.04లు సొమ్ములు దోచుకుపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాధితులు రమణయ్య అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో మంచి నీటి సమస్యకు సంబంధించి సర్పంచ్ సల్లా వీరభద్రమ్ జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమాల్లో విన్నవించుటకు తిరుపతి వెళ్ళారు. ఆయనతో పాటు రమణయ్య వెళ్ళారు. రమణయ్య విధి నిర్వహణలో ఉండగా ప్రమాదానికి గురై కాలు కొల్పోయారు.కుటుంబ పోషణ దుర్భరమైంది.తన బాధలను విన్నవించుకొనుటకు వెళ్ళిన రమణయ్య ఇంటికి తాళాలు తగిలించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్పందన అర్జిని అందించి వచ్చిన రమణయ్య ఇంటి తాళాలు పగుల గొట్టి ఉండటం గమనించిన రమణయ్య లబోదిబో అన్నారు. వెంటనే పోలీసులకు పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా రమణయ్య అందించిన ఫిర్యాదుమేరకు ఇంటిలోని సుమారు 20 సవర్ల బంగారు నగలు, అలాగే రూ.ంరెండులక్షల నాలుగువేల రూపాయలను దొచుకెళ్ళారని ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసారు.ప్రత్యేక బృందాలను విచారణకు పంపారు.చుట్టుపక్కల ఉన్నపోలీసు స్టేషన్లకు సమాచారం అందించారు.

## వెంకట పద్మావతి కాలనీలో చోరీ

### -బంగారు,వెండి ఆభరణాలతో పాటు నగదు అపహరణ

తిరుచానూరు,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

తిరుచానూరు శ్రీ వెంకట పద్మావతి కాలనీలోని ఓ ఇంటిలో ఆదివారం ఆర్ధరాత్రి దొంగలు చొరబడి బీరువాలోని బంగారు,వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు.బాధితుడు రమేష్ తన కుటుంబంతో కలిసి శనివారం తమిళనాడులోని గుడికి వెళ్లి తిరిగి ఆదివారం అర్ధరాత్రి తమ ఇంటికి రాగానే తాళాలు పగులగొట్టబడి తలుపు తెరిచిఉండటాన్ని గమనించారు.అనుమానం వచ్చి ఇంటిలోనికి వెళ్లి చూడగా,బీరువా మొత్తం చిందర వందరగా ఉండటాన్ని చూసి హతాసులయ్యారు.వెంటనే తిరుచానూరు పోలీసులకు సమాచారమివ్వగా, ఎస్ఐ చిరంజీవి తమ సిబ్బంది, క్లూస్ టీంతో చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.అనంతరం బీరువాకు ఉన్న దొంగల వేలుముద్రలు సేకరించి,కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

## గూడూరు వెలుగు కార్యాలయం అవినీతిమయం

- రూ.40 లక్షల అవినీతిలో విఓఎ చేతివాటం
- ఎస్టీ, బీసీల వద్ద సంతకాలు సేకరించి రూ.40 లక్షలు డ్రాచేసిన వైనం
- విఓఎ భర్తను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన పొదుపు సంఘాల మహిళలు
- వెలుగు ఎపిఎం, సిసిలు, ఎసిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆందోళన కార్యక్రమం చేపట్టిన మహిళలు

గూడూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని 6వ సంఘబంధంలోని ఎస్టీ, బీసీ పొదుపు సంఘాల మహిళల ద్వారా సంతకాలు సేకరించి, ఆ పొదుపు సంఘాల గ్రూపులకు విఓఎగా పనిచేస్తున్న చల్లా శ్రీలక్ష్మి దాదాపు 40 లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు పొదుపు సంఘాల మహిళలు ఆరోపిస్తున్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాల మహిళలు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్టీ, బిసి మహిళలమైన తాము కూలీ పనులు చేసుకుంటూ గత 15 సంవత్సరాల నుంచి డ్వాక్రా పొదుపు సంఘాల్లో పొదుపు చెల్లిస్తున్నట్లు తెలిపారు. తమకు విఓఎగా పనిచేస్తున్న చల్లా శ్రీలక్ష్మి 6వ సంఘ బంధంలోని ఐదు గ్రూపు సభ్యుల సంతకాలు సేకరించి గూడూరు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులో రూ.40 లక్షలు రుణం తీసుకున్నట్లు తెలిపారు. అందులో ఏడు లక్షలా 20వేల రూపాయలు మాత్రమే గ్రూపు సభ్యులకు చెల్లించిందని తెలిపారు. మిగతా 32 లక్షలా 80 వేల రూపాయలు విఓఎ చల్లా లక్ష్మి స్వాహా చేసినట్లు తెలిపారు. ఇదే విషయమై చల్లా శ్రీలక్ష్మిని సంఘబంధంలోని గ్రూపు సభ్యులంతా నిలదీయగా, అప్పటి నుంచి ఆమె కనిపించడం లేదన్నారు. ఇదే విషయాన్ని గూడూరు ఎపిఎం బుజ్జమ్మకి అర్జీరూపంలో ఇచ్చి ఆమెను సంప్రదించగా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. నాలుగురోజుల క్రితం విఓఎ చల్లా శ్రీలక్ష్మి భర్త చల్లా మురళిని గ్రూపు సభ్యులందర కలిసి గూడూరు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐకి అప్పగించి నమోదు నమోదు చేయాలని అర్జీ ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారన్నారు. ఈ పొదుపు గ్రూపు సభ్యుల స్వాహా విషయంలో గూడూరు ఎపిఎం బుజ్జమ్మ, సిసిలు నరసింహులు, దశరథరామయ్య, ఎసి వెంకటరావులకు కూడా ఇందులో సంబంధం ఉందని, వారిని కూడా విచారించాలని ఉన్నతాధికారులను కోరారు. తాము తీసుకున్న రుణాన్ని అయితే చెల్లించగలం గాని తీసుకోని రుణాన్ని కూడా ఎక్కడ నుంచి చెల్లిస్తామని వారు ప్రశ్నించారు. ఈ విషయమై విచారించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణమ్మ, మల్లేశ్వరి, వరలక్ష్మి, లీలావతి, మాధవి, రత్నమ్మ, రాధిక, లలిత, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ డాక్టర్ హత్య కేసులో వీడని మిస్టరీ

### - నిందితుల కోసం మూడు బృందాలు ఏర్పాటు : డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

డాగ్‌స్క్వాడ్ ద్వారా గాలింపు చర్యలు, హత్యకు గురైన సందానీ బాషా

వెంకటగిరి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:

తెలుగుగంగ కాలువ వద్ద హత్యకు గురైన ఎస్‌కె సందానీ బాషా హత్య కేసు మిస్టరీగా మారింది. వెంకటగిరికి చెందిన సందానీ బాషా దక్కిలి మండలం మోపూరు రోడ్డులో ఆర్ఎంపీ డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. అయితే ఆదివారం రాత్రి మోపూరు రోడ్డు నుంచి వెంకటగిరి మోటారుబైక్‌పై వస్తుండగా తెలుగుగంగ కాలువ వద్ద నిందితులు అడ్డగించి కత్తులతో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. ఆర్ఎంపీ డాక్టర్‌ను ఎవరూ చంపి ఉంటారు.. కారణాలేమిటి.. రెండు రోజుల నుంచి తెలియజేయలేదు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్స్‌ను రప్పించి సంఘటనా స్థలం వద్ద పరిశీలిస్తున్నట్లు చెప్పారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు సాగిస్తున్నట్లు చెప్పారు. నిందితులను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

## ఆరణిపై పోటీ చేసి గెలిచే సత్తా వుందా!

### - ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులుకు సింగిల్‌విండో చైర్మన్ శివకుమార్ సవాల్

చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే సత్తా తెలుగుదేశం నాయకులకు వుందా! అని యాదమరి సింగిల్‌విండో ఛైర్మన్ శివకుమార్ ఛాలెంజ్ విసిరారు. జిల్లా వైకాపా పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరు పర్యటనలో నారా లోకేష్, ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు భూకబ్జాలపై చేసిన ఆరోపణలపై మాట మార్చారన్నారు. ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలపై కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా! అన్న సవాల్‌కు దేశం నాయకుల నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. చిత్తూరులో నారా లోకేష్ పర్యటనలో ఎంత మంది ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వానికి విన్నవించారని ఆయన నిలదీశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చిత్తూరు విజయ డైరీని పునఃప్రారంభించడానికి చర్యలు తీసుకోవడంతో పాటు చక్కెర ఫ్యాక్టరీ కార్మికులకు 31 కోట్ల రూపాయాల బకాయిలు ఇప్పించడానికి కృషి చేశారన్నారు. చిత్తూరు నగరంలో గంగినేని చెరువు, గాంధీ కూడలిని సందరీకరణకు చర్యలు తీసుకొన్నామన్నారు. చిత్తూరులో మట్టి రోడ్లను తారు రోడ్లుగా మార్చడం జరిగిందని, బైపాస్ రోడ్డుకు కొత్తగా వేయనున్నామన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే సికె బాబుతో లోపాయికారి ఒప్పందం చేసుకొని ఆరణి శ్రీనివాసులను ఓడించడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు కృష్ణారెడ్డి, రమణ, రామ్‌గణేష్, దాడి మున్నా తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగివుండాలి

తవణంపల్లె, పిబ్రవరి 13 ప్రభాతవార్త:

కుష్టువ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి వుండాలని జిల్లా కుష్టు నివారణాధికారి డాక్టర్ రవిరాజ్ అన్నారు. సోమవారం స్పర్శ కుష్టువ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాది పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని తెలిపారు. ఇందులో భాగంగా కుష్టువ్యాది అంటువ్యాది కాదు, స్పర్శలేని మచ్చలా కుష్టువ్యాది కావచ్చు, రాగి రంగులు మచ్చలు-కుష్టువ్యాధి కావచ్చునని తెలిపారు. కుష్టువ్యాధిని తొలిదశలోనే గురిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చునని తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు దాతలు అరగొండ రాజేశ్వరమ్మ, ద్వారకాపురం మోహన్‌రెడ్డి అందించిన దుప్పట్లు, చీరలు, పంచెలు, ఎంసీఆర్ చెప్పులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ దాత్రేయ చౌదరి, పీహెచ్ఎన్ భారతి, డీపీఎంఓలు మణి, దయానందం, రాముడు, ఏపీఎంఓ దేవన్, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గళంను మండలికి పంపుదాం

### - జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు

చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ప్రశ్నించే గళం కలిగే వారని సమస్యల పరిష్కారం కోసం ఆయన గెలుపు బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖల కార్యాలయాల్లో సోమవారం బిజెపి నాయకులు తమ అభ్యర్థి విజయం కోసం ప్రచారం చేశారు. నిరుద్యోగులకు గత ప్రభుత్వాలు మోసం చేశాయని తమ అభ్యర్థి ఇప్పటికే పలు ఉద్యమాలకు నాయకత్వం వహించి నిరుద్యోగులకు న్యాయం జరిగేలా పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సి.బాబు, గురుగణేష్, ఎంజి రామభద్ర, గోకుల్‌మాధవ్, శేషాద్రికుమార్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## 19న జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన ఈ నెల 19వ తేదీ జడ్పీ సమావేశభవనంలో జరుగనుందని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వుండటంతో ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శక సూచనల మేరకు సమావేశం జరుగుతుందని సిఇఓ తెలిపారు. ఈ సమావేశానికి సభ్యులందరు హాజరు కావాలని ఆయన కోరారు.

## జగనాసుర రక్తచరిత్ర పుస్తకం ఆవిష్కరణ

చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలతలు జగనాసుర రక్తచరిత్ర పుస్తకంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలతలు మాట్లాడుతూ కుటుంబ పెద్దనే స్వార్థ రాజకీయాల కోసం బలి తీసుకొన్న చరిత్ర సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిదని ఆరోపించారు. రాష్ట్రంలో వైకాపా అధికారం చేపట్టినప్పటి నుండి అరాచకం పెరిగిందని ఉదాహరణలతో వివరించారు. సిఎం వైఎస్ జగన్‌ను సత్వరం ఇంటికి పంపడానికి రాష్ట్ర ప్రజానీకం సిద్ధంగా వుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో వృద్ధురాలు మృతి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కెజి సత్రం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. చిత్తూరు నగరం ఇరువారంకు చెందిన రాజమ్మ(78) తన కుటుంబ సభ్యులతో ద్విచక్రవాహనంపై బంగారుపాళ్యంకు బయలుదేరింది. కెజి సత్రం వద్ద ద్విచక్రవాహనంకు పెట్రోల్ పట్టించుకోవడానికి రోడ్డు దాటుతుండగా పలమనేరు నుండి చిత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం వెనుకవైపు కూర్చొన్న రాజమ్మ తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవలు అందించడానికి తిరుపతికి తరలిస్తుండగా ఆమె మార్గమధ్యలో మృతి చెందింది. ఈ మేరకు బంగారుపాళ్యం ఇన్స్‌పెక్టర్ నరసింహారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు ప్రాంతాలలో పట్టణానికి చెందిన ముగ్గురు మృతి

పుంగనూరు,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :

పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు సోమవారం మృతిచెందడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పట్టణంతో పాటూ పలుగ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఆరుదశాబ్దాలుగా టైపింగ్ రంగంలో శిక్షణ ఇచ్చిన పాండు విఠల్‌రావు సోమవారం ఉదయం మృతిచెందారు. కాగా ఆర్యవైశ్యవీధికి చెందిన యువ వ్యాపారస్తుడు వేమల నాగనర్సింహులు గుండెపోటుకు గురికాగా అత్యవసర చికిత్స పొందుతూ మరణించారు. ఇదే క్రమంలో ప్రభుత్వ వైద్యశాలకు చెందిన జూనియర్ అసిస్టెంటు మదన్‌మోహన్‌రాజు గతంలో విధులలో ఉండగానే కిందపడి తలకు గాయం కాగా బెంగళూరులో చికిత్స పొందుతూ ఉదయం మరణించారు. వీరి మృతిపట్ల నాయకులు కొండవీటినాగభూషణం, వెంకటరెడ్డియాదవ్,మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా,ఎఏఎంసి ఛైర్మన్ నాగరాజరెడ్డి,ప్రభుత్వవైద్యశాల కమిటీ ఛైర్మన్ డాక్టర్ శరణ్‌కుమార్‌లతో పాటూ పలువురు సంతాపం తెలిపారు.

## వివేకానందరెడ్డి హత్యకేసు సూత్రధారులను శిక్షించాలి

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

### -తెదేపా నేతలచే జగనాసుర రక్తచరిత్ర పుస్తకాల ఆవిష్కరణ

కుప్పం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

కడప మాజీ ఎం.పి., సిఎం జగన్‌రెడ్డి సొంత బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సిబిఐ అసలైన సూత్రధారులను శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వివేకా హత్య కేసులో సిఎం జగన్‌రెడ్డి ప్రమేయం ఉందని ఆరోపించారు.మూడన్నర ఏళ్ల పాలనలో వివేకా హత్య కేసు ఎందుకు ముందుకు సాగలేదని ప్రశ్నించారు. వైఎస్ సునీతారెడ్డికి ఎపి సిఎం,అధికారులపై నమ్మకం లేకుండా తన తండ్రి వివేకానంద హత్య కేసు తెలంగాణా సిబిఐకు బదిలీ చేయాలని కోరిన అనంతరం కేసు పురోగతి సాధిస్తోందన్నారు. ఎంపి అవినాష్‌రెడ్డి వివేకాన ందరెడ్డి హత్య జరిగిన రోజు పదేపదే సిఎం జగన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి పిఎలకు ఫోన్లు చేసిన విషయం సిబిఐ విచారణలో తేలిందన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని వివేకానంద హత్యను గుండెపోటుగా చిత్రీకరించింది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. జగనాసుర రక్తచరిత్ర పుస్తకంలో వివేకానందరెడ్డి హత్య తీరుపై అన్ని విషయాలు ప్రచురించడం జరిగిందన్నారు. గత ంలో సిఎం జగన్‌రెడ్డి కోడికత్తి డ్రామా ఆడారన్నారు. సైకో ప్రభుత్వానికి ప్రజలు ఉద్వాసన పలకడం ఖాయమన్నారు. యువనేత నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఆయన ప్రచార వాహనాలు సీజ్ చేయడం, పాదయాత్రను చిత్రీకరించడం దారుణమన్నారు. అంతకుముందు జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని దేశం నేతలు ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు సాంబశివం, సతే ్యంద్రశేఖర్, శాంతారాం , మణి, బాబునాయుడు, ప్రతాప్, ఎవి రవి, సంతోష్, చలపతి, మహేంద్ర, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## జడ్పీఛైర్మన్‌చే శ్రీవీరాంజనేయస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

వి.కోట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

వి.కోట పట్టణంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి పుష్పపల్లకి సందర్భంగా సోమవారం జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద నుంచి జడ్పీఛైర్మన్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో సమర్పించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్లు దవనం భక్త,గోపిరెడ్డి, ఎపిఆర్‌డిసి డైరెక్టర్ బాలగురునాథ్, సర్పంచ్ పిఎన్ లక్ష్మి, ఎఎంసి వైస్ ఛైర్మన్ ఆంజనేయులు, స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్.. లయన్స్‌క్లబ్‌చే బియ్యం బస్తాల వితరణ

కుప్పంరూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా అన్నదానం జరిపేందుకు కుప్పం బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్‌ల అధ్వర్యంలో సుమారు 30వేల విలువ చేసే బియ్యం బస్తాలను వితరణగా అందించారు. ఈ బియ్యం బస్తాలను సోమవారం ఆలయ నిర్వాహకులకు తమవంతు సాయంగా అందించినట్లు కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డా'॥ మహేష్ తెలిపారు. భక్తులకు తమవంతు సాయంగా అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి సోమశేఖర్, కోశాధికారి సెంథిల్‌కుమార్, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ పిజి సెల్వం, డైరెక్టర్లు శివ, సుబ్రమణ్యం, నాగరాజు, లక్ష్మీనారాయణ, సభ్యులు నాగరాజు, శివ పాల్గొన్నారు.

## ఉన్నతపాఠశాలలో మంచినీటి కొళాయిలు ధ్వంసం

చౌడేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

స్థానిక ఉన్నతపాఠశాలలో గుర్తు తెలియని ఆకతాయిలు మంచినీటి కొళాయిలను ధ్వంసం చేసారు. పాఠశాల ఆవరణంలో ప్రతిరోజూ మద్యం సేవించి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయుడు వెంకటశివయ్య తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. కాగా ఉన్నతపాఠశాలకు వాచ్‌మెన్ లేకపోవడం గమనార్హం.

## దాదేపల్లి నూరుల్లాకు డాక్టరేట్

చౌడేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లికి చెందిన షేక్ నూరుల్లాకు మద్రాస్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసింది. రఫీ, గుల్జార్‌బీల కుమారుడైన నూరుల్లా చెన్నైలోని మద్రాస్ విశ్వవిద్యాలయంలో ఉర్దూ విభాగం నందు పిహెచ్‌డి డిగ్రీ పొందాడు. థీసీస్ అరబిక్, ఫర్షియన్ అండ్ ఉర్దూ డిపార్ట్‌మెంట్ ప్రొఫసర్ ఖాజీహబీబ్ అహమ్మద్ పర్యవేక్షణలో నూరుల్లా పూర్తి చేసారు. దీంతో ఆయన్ను డాక్టరేట్ వరించింది. పల్లె నుంచి డాక్టరేట్ పొందని యువకుడిని అందరూ అభినందిస్తున్నారు.

## అల్లుడి చేతిలో గాయపడ్డ మేనమామ

చౌడేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

అల్లుడి చేతిలో మేనమామ గాయపడ్డ సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. బాధితుని కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం చారాల కృష్ణప్పను అదే గ్రామానికి చెందిన అతని మేనల్లుడు రెడ్డిమోహన్ పాతకక్షలతో దాడి చేసి గాయపరచాడనీ, ఈ మేరకు స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు బాధితుడు తెలిపాడు.

## వాహనాల వేలంతో రూ.5.55లక్షల ఆదాయం

### ఎస్ఇబి సిఐ సీతారామిరెడ్డి

పుంగనూరు,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :

పుంగనూరు ఎస్ఇబి పరిధిలో అక్రమమద్యం రవాణా సంబంధించి సీజ్‌చేసిన 39వాహనాలను సోమవారం ఉదయం వేలం నిర్వహించారు. ఈవాహనాల వేలంద్వారా జిఎస్‌టితో కలిపి రూ.5.55లక్షలు ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన స్వరూపా రాణి

బాలాయపల్లి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:

మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా స్వరూపారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోట ఈవోపీఆర్‌డీగా బాధ్యతలు నిర్వహిస్తుండగా ఇక్కడకు బదిలీ చేశారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డిని మర్యా దపూర్వకంగా కలిశారు. మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. పలువురు సిబ్బంది కలిసి ఆమెను అభినందించారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఇఓ

దొరవారిసత్రం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం చందనముడి ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఇఓ దారా మస్తానయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలు భవనాలను, రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకాన్ని దగ్గరుండి పరిశీలించారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలిచ్చారు.

## తిరుమలకు పాదయాత్రగా ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ భక్త బృందం

బాలాయపల్లి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:

ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ భక్త బృందం వారు తిరుమలకు పాదయాత్రగా బయలుదేరి బాలాయపల్లికి చేరుకున్నారు. జగద్గురు ఆదిశంకరాచార్యులు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నడిచిన పుణ్యభూమిలో మేము నడిస్తే పుణ్యం కలుగుతుందని తిరుమలకు పాదయాత్ర చేస్తున్నామని భక్తులు తెలిపారు. మూల్యం మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పాదయాత్ర భక్తులు తెలిపారు.

## వన్‌టైమ్ సెటిల్‌మెంట్లను సద్వినియోగం చేసుకోండి

కోట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

దొరవారిసత్రం కెనరా బ్యాంకులో మొండి బకాయిలు ఉన్న ఖాతాదారులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సోమవారం బ్రాంచి మేనేజర్ సుబ్బారావు కోరారు. బ్యాంకు మేనేజర్ సుబ్బారావు మాట్లాడుతూ పలు కారణాలతో రుణాలను సక్రమంగా చెల్లించని మొండి బకాయిదారులకు బ్యాంకులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా రుణాలు మాఫీ చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా ఎన్‌సిఆర్ జన్మదిన వేడుకలు

నాయుడుపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

నాయుడుపేట ఏఎంసీ మాజీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి (ఎన్‌సీఆర్) జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. నెల్లూరులోని తేజస్విని హోటల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విచ్చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నాగిరెడ్డి జన్మదిన వేడుకల్లో నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, టిఎంఆర్ గ్రూప్స్ అధినేత తంబిరెడ్డి మోహన్‌రెడ్డి, నాయుడుపేట మండల సచివాలయ కన్వీనర్ ఒట్టూరు కిషోర్‌యాదవ్, నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ దువ్వూరు లక్ష్మీనారాయణరెడ్డి, తిమ్మాజికండ్రిగ సర్పంచ్ ఎన్.ప్రకాష్, పలువురు వైసీపీ నేతలు పాల్గొని ఎన్‌సీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మోటార్‌సైకిల్ చోరీ నిందితుని పట్టివేత

తడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

తడలో ఆదివారం జరిగిన మోటార్‌సైకిల్ చోరీ కేసుకు సంబంధించి నిందితుని పట్టుకొని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమిళనాడుకు చెందిన ఆరంబాకం సమీపంలోని తోకమూరు గ్రామ నివాసి టి.కలయ్‌కన్నన్‌ను తడకు సమీపంలోని శ్రీసిటీ జీరోపాయింట్ వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ జె.పి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పొన్నపాడుకు చెందిన పిల్లి శంకరయ్య మోటార్‌సైకిల్ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిందితుని కాపుకాచి పట్టుకున్నారు.

# స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత

## అడిషనల్ ఎస్పి అడ్మిన్ వెంకట్రావు

తిరుపతి క్రైం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలకు మొదటి ప్రాధాన్యత త్వరితగతిన పరిష్కారమని అడిషనల్ ఎస్పి అడ్మిన్ వెంకట్రావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పి అడ్మిన్ వెంకట్రావు నిర్వహించి ప్రజల నుండి పిర్యాదులు స్వీరించారు. ఎస్పి ప్రజల సమస్యలకు సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు విషయాలను కుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం

తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 60 మంది వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని సుదూర ప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పి కార్యాలయానికి రాలేని వృద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా స్పందన ఫిర్యాదు లాగానే పరిగణించడం జరుగుతుందని తెలిపారు.

## సబ్ జూనియర్ జూడోలో వడమాలపేట విద్యార్థి ప్రతిభ

వడమాలపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడోపోటీల్లో వడమాలపేట విద్యార్థి భవిత వెండి పతకాన్ని సాధించినట్లు పీడీ చంద్రశేఖర్ రాజు తెలిపారు. కృష్ణా జిల్లా విజయవాడ మాంటిసోరి ఇండోర్ స్టేడియంలో ఫిబ్రవరి 11,12వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న వడమాలపేట హైస్కూలు 8వ తరగతి విద్యార్థి పి.భవిత 36 కిలోల విభాగంలో రెండో స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించింది. పతకం సాధించిన విద్యార్థి భవితను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

## మెట్టినింటి ఆత్మగౌరవం తెలంగాణ ఆడపడుచు

### ప్రేమ వివాహంతో ఒక్కటైన "కొటాల దంపతులు"

చంద్రగిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

మెట్టినింటి ఆత్మగౌరవమైన తెలంగాణ ఆడపడుచు ప్రేమైక దాంపత్య జీవన ప్రయాణం స్ఫూర్తిగా నిలుస్తున్నది. రామిరెడ్డి పల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కొటాల పద్మజ, ప్రస్తుత సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు తమ ఇద్దరు సంతానంతో కలసి ప్రజలకు సేవలందిస్తున్నారు. ఫిబ్రవరి 14 ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని.. ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణలోని ఖమ్మం పట్టణంలోని అనీబీసెంట్ కళాశాలలో ఎంసిఏ చేస్తున్న పద్మజ ప్రాజెక్టు పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్ళిన పద్మజ, రామిరెడ్డిపల్లి పంచాయతీ, కూచివారిపల్లికి చెందిన స్నేహితురాలితో రూమేట్‌గా వున్నారు. అప్పటికే హైదరాబాద్‌లో కాంట్రాక్టర్‌గా వుంటున్న కొటాల చంద్రశేఖర్ రెడ్డి తమ గ్రామానికి చెందిన అమ్మాయి కోసం రూమ్‌కు వెళ్ళడం, పద్మజ పరిచయం కావడం, కొంత కాలానికి ప్రేమగా ఫరిఢవిల్లడంతో కులాలు వేరైనా ఇరువురి తల్లిదండ్రులు వీరి ప్రేమను అంగీకరించి ఆశీర్వదించడంతో 2007 ఫిబ్రవరి 11న తిరుమల శ్రీవారి చెంత దంపతులయ్యారు. వివాహ అంతరం మెట్టినింటికి చేరుకున్న పద్మజ భర్త సహకారంతో రాజకీయ ప్రవేశంతో తొలి ప్రయత్నంలోనే పంచాయతీ సర్పంచ్‌గా విజయం సాధించి ప్రజలకు విశిష్ట సేవలందించారు. ఆమె ప్రజా సేవలలో వెనుక నిలిచి నడిపించిన కొటాల చంద్రశేఖర్ రెడ్డిని సైతం ప్రజలు ఆధరించి పంచాయతీ సర్పంచ్‌ని చేయడంతో ప్రస్తుతం కొటాల దంపతులు తమ ప్రేమను ప్రజలకు పంచుతూ ఆదర్శ దంపతులుగా "ప్రేమికుల రోజు శుభాకాంక్షలు" అందుకుంటున్నారు.

## అభివృద్ధి అజెండాగా పని చేస్తున్నాం - పవిత్రరెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం, వెంకటాపురం పంచాయతీ పద్మావతి పురం గ్రామ ప్రజలు రేణిగుంట మండల ఇన్‌చార్జి పవిత్రరెడ్డితో డ్రైన్, రోడ్డు సమస్య ఉందని తెలియచేయగా తక్షణం స్పందించిన ఆమె ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, అధికారులతో కలసి సోమవారం గ్రామాన్ని సందర్శించారు. పవిత్రరెడ్డి మాట్లాడుతూ అధికారంలో వచ్చిన తరువాత మెయిన్ రోడ్డు నిర్మించామని అన్నారు. ఇంటర్నల్ రోడ్డు, మెయిన్ డ్రైన్ సమస్య ఉందని ఈ సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామస్థులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పవిత్రరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నేతలు యోగేశ్వరరెడ్డి, దయాకర్‌రెడ్డి, స్థానిక నేతలు జమ్మలుదిన్, అక్బర్, షేక్ బాషా, మస్తాన్, సోము, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్మాత్మిక చింతనతోనే సమాజంలో శాంతి

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

సమాజంలో శాంతి సౌఖ్యాలు అలవాడాలంటే ఆధ్మాత్మిక చింతన ఎంతో అవసరమని బొల్లినేని జగన్నాధం నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో 'శ్రీకాళహస్తీశ్వర మహా క్షేత్ర మహాత్మ్యం' గ్రంధాలను ప్రజలకు అందిస్తున్నారు. శ్రీకాళహస్తికి చెందిన గ్రంధాన్ని ప్రసూనా దొరస్వామి రచించారు. ఇందులో ఉపనిషత్తుల ఆధారంగా జీవుడు శివుడు, ఈశ్వరతత్వాన్ని పొందు పరచారు. శ్రీకాళహస్తీశ్వరదివ్యక్షేత్రం అప్రదక్షిణ క్షేత్రం ఎందుకు అయ్యింది? అలాగే ఇక్కడి క్షేత్రం ప్రాశస్త్యంను పొందుపరచారు.ఎన్నో జీవ రహస్యాలను పొందుపరచారు.ఈ పవిత్ర గ్రంధాన్ని రూ.500లకు విక్రయిస్తున్నారు.అలాంటి విలువైన గ్రంధాలను బొల్లినేని జగన్నాధం నాయుడు ప్రజలకు అందిస్తున్నారు.ప్రాణ దానం, అన్నదానం, నేత్రదానం వంటి దానాలు ఉత్తమమైనవని సమాజాన్ని సన్మార్గంలో నడిపించాలంటే మనిషికి మానసిక ప్రశాంతత చాలా అవసరమని అందుకే ఇలాంటి పవిత్ర గ్రంధాలను అందిస్తున్నామని దానిని ఉపయోగించుకోవాలని బొల్లినేని జగన్నాధం నాయుడు అన్నారు.ఈ గ్రంధాలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఈ ఆధ్మాత్మిక గ్రంధాలను అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ బాలుర డిగ్రీ పిజి కళాశాల ప్రిన్సిపల్ నాగరాజునాయుడు, గ్రంధాలయ ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## శివయ్య సేవలోఎడిసి

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ పూజలు జరిపించుకున్నారు. శ్రీకాళహస్తిలోని గంగా సదన్‌లో రాష్ట్ర స్తాయిలో ఉన్న భూ వివాదాలకు సంబంధించిన అంశాన్ని చర్చించుటకు ఇక్కడ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎడిసి చంద్రశేఖర్ ఆజాద్ ఉప కమిషనర్ రాణాప్రతాప్ హాజరయ్యారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి క్షుణ్ణంగా తెలిసిన ఎడిసి చంద్రశేఖర్ ఆజాద్ సమావేశం అనంతరం స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆజాద్ శివరాత్రి ఏర్పాట్లు, నిర్వహణకు సంబంధించి వాకబు చేసారు.దర్శనానంతరం వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.ఏర్పాట్లను ఇఓ వికెసాగర్‌బాబు, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎసి మల్లికార్జున్ ప్రసాద్‌లు పర్యవేక్షించారు.

## బ్రహ్మోత్సవాలకు ఎస్‌బిఐ రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి మేనేజర్ స్వప్నప్రియ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారక శ్రీనివాసులు, ఇఓ వికె.సాగర్‌బాబులకు అందించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ బ్యాంకు సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు. కాగా నిత్యాన్నధాన పథకానికి ఆలయ ప్రత్యేకాహ్వానితులు చింతామణిపాండు కుటుంబసభ్యులు తమ వంతు సాయంగా విరాళాన్ని అందించారు.

## యువగళం పాదయాత్రకు విశేష స్పందన

పుత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుత్తూరులో సోమవారం చేపట్టిన యువగళం పాదయాత్రకు విశేష స్పందన లభించింది. చినరాజుకుప్పం వద్ద ప్రారంభమైన పాదయాత్ర చిత్తూరు - పుత్తూరు రోడ్డు, తిరుపతి - చెన్నై రోడ్డు మీదుగా చిదా స్పిన్నింగ్ మిల్లు వద్ద సత్యవేడు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే నారాయణవనం మండలం వరకూ కొనసాగింది. చినరాజుకుప్పం నుంచి బయలుదేరిన లోకేష్ మార్గమధ్యంలో నెత్తం, చెర్లోపల్లి, వినాయకపురం కూడలి, కల్యాణపురం, ఆరేటమ్మ కాలనీ వద్ద పెద్ద సంఖ్యలో తన కోసం ఎదురుచూస్తున్న ప్రజలను కలిశారు. అడుగడుగునా లోకేష్‌కు టిడిపి శ్రేణులు వేల సంఖ్యలో హాజరై టపాసులు, వివిధ రకాల వాయిద్యాల హోరుతో స్వాగతం పలికారు. పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి లోకేష్ నివాళి అర్పించారు. శ్రీనివాస థియేటర్ వద్ద టిడిపి మాజీ అధికార ప్రతినిధి పోతుగుంట విజయ్ బాబు ఆయన అనుచరులతో క్రేన్ ద్వారా వినూత్న పద్ధతిలో అరటి గెలలతో కూడిన మాలతో లోకేష్‌ను సత్కరించారు. పాదయాత్రకు వేల సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులకు, ప్రజలకు చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య భోజనం, మంచినీళ్ల వసతి కల్పించారు. నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ పాదయాత్ర ఆద్యంతం లోకేష్‌తో కలిసి నడిచారు. ఆయనతో పాటు పార్టీ పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, బిసి సంఘం జిల్లా అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి తదితర పలువురు నాయకులు, కార్యకర్తలు లోకేష్‌ను అనుసరించారు. చినరాజుకుప్పం నుంచి నారాయణవనం బైపాస్ కూడలి వద్ద రోడ్డు కిరువైపులా భారీ సంఖ్యలో జనం లోకేష్‌కు చేతులు ఊపుతూ స్వాగతం పలికారు.

## శ్రీపాద సేవకులకు టీషర్టులు బహూకరణ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వివిధ వర్గాలు, వ్యాపార సంస్థల నుంచి వితరణలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పొట్టిశ్రీరాములు జిల్లా నాయుడుపేటకు చెందిన సాగర్ సిమెంట్ అధినేత శ్రీపాద కూలీలకు టీ షర్టులు అందించారు.సాగర్ సిమెంటుకు చెందిన కె.సుబ్రమణ్యం, సురేష్,రమేష్‌లు సుమారు రూ.లక్ష విలువ కల్గిన 300 టి షర్టులను ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికెసాగర్‌బాబులకు అందించారు.వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద దాతలకు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను ఇఓ చైర్మెన్ అందించారు.

## ఎంఎల్‌సి ఎన్నికలకు రాజకీయపార్టీ నాయకులు సహరించండి

తొట్టంబేడు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మార్చిలో జరిగే ఎంఎల్‌సి ఎన్నికలకు అన్ని పార్టీల రాజకీయనాయకులు సహకరించాలని తొట్టంబేడు తహశీల్దార్ సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పట్టభద్రులు మరియు ఉపాధ్యాయ నియోజకవర్గంకు పదవీకాలం ముగిస్తున్న దృష్ట్యా శాసనమండలి ఎన్నికలు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ మరియు ఉపాధ్యాయ నియోజకవర్గంకు ఎన్నికలను నిర్వహించడానికి షెడ్యూలను ప్రకటించినట్లు తెలిపారు. సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. తమ తమ కార్యకర్తలకు తగిన బ్యాడ్జీలు లేదా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఓటర్లకి ఇచ్చే గుర్తింపు స్లిప్‌లు తెల్లపేపర్లలో ఉండాలే తప్ప వాటిపై ఏచిహ్నం, అభ్యర్థి పేరు లేదా పార్టీ పేరు ఉండరాదన్నారు. ఎన్నికల నిబంధలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పలు రాజకీయపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విఆర్‌ఏల సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం

తొట్టంబేడు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

దీర్ఘకాలంగా ఉన్న విఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం తొట్టంబేడు తహశీల్దార్ సుధీర్‌రెడ్డికి తొట్టంబేడు విఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు అంకయ్య, ఉపాధ్యక్షురాలు భవానీ తదితరుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈంసదర్భంగా పలువురు విఆర్‌ఏలు మాట్లాడుతూ తమను నాలుగోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, విధుల్లో ఉంటూ మృతిచెందిన వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి కారుణ్యనియామకాల కింద ఉద్యోగం ఇవ్వాలని, ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న డిఏలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈసమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని తహశీల్దార్‌ను కోరారు.

## బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా మార్చుదాం

తొట్టంబేడు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

రాష్ట్రాన్ని బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ఉన్న మథర్‌ధెరీస్సా మహిళా మండలి అధ్యక్షురాలు పి.మేరీచంద్రమ్మ పిలుపునిచ్చారు. సోమవారం గ్రామంలోని మథర్‌ధెరీస్సా మహిళా మండలి ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు పనిచేయాలని కోరారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శివపార్వతుల కళ్యాణోత్సవంలో జరిగే బాల్యవివాహాలపై నిఘా ఉంచాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. బాల్యవివాహాలు బాలికలకు భవిష్యత్తులో ప్రమాదం అని, నిరక్షరాస్యత అవగాహన లేనికారణంగా చదువుకునే వయస్సులో వివాహాలు అనర్థం అన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లు తెలిస్తే వెంటనే ఐసిడిఎస్ అధికారులకు కానీ, పోలీసులకు కానీ, గ్రామంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కానీ తెలపాలన్నారు. సమావేశంలో రాస్ మహిళా సంస్థ ఆడిటర్ సుబ్బారావు, ఆనిమేటర్లు జ్యోష్ణ, పల్లవి, శకుంతలమ్మ, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు మెరుగైన సేవలందించండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మహాశివరాత్రి ఉత్సవాల్లో స్వామి అమ్మవార్ల దర్శనం కోసం విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణత సాధించిన బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది స్కౌట్ విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లుగా సేవలందించడం అభినందనీయం అన్నారు. ప్రస్తుతం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు మెరుగైన సేవలందించాలని, వారితోమర్యాదగా నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కౌట్స్ కౌన్సిల్ సభ్యులు టి.రమేష్‌బాబు, మాస్టర్ అజారుద్దీన్, సుబ్రమణ్యం, వెంకటేష్, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తకన్నప్పకు పట్టువస్త్రాలు సమర్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువు కున్న 1987-88 బ్యాచ్ విద్యార్థులు శ్రీభక్తకన్నప్ప ఎడ్యుకేషన్ సొసైటీ పేరిట స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. గత పదేళ్ళుగా ఉత్సవాల సమయంలో శివయ్య తొలిభక్తుడు భక్తకన్నప్పకు పట్టువస్త్రాలను అందించే సంప్రదాయాన్ని తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో సోమవారం భక్తకన్నప్పకు భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలను అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అంజూరుగిరిబాబు, రాజేశ్వరరావు, జిఎంఆర్‌సుబ్రమణ్యం, విశాలి, కవిత, సుబ్రమణ్యం, శేషు, హరీష్, శ్రీవత్సవన్, రాజ, బాల తదితరులు పాల్గొన్నారు.

## టిడిపిలోకి మాజీ ఉసర్పంచ్ ఆరుముగంశెట్టి

నారాయణవనం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :

నారాయణవనం మేజర్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కెఎం ఆరుముగంశెట్టికి నియోజకవర్గ ఇంచార్జీ హెచ్ హెలెన్ హేమలత టిడిపి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2019 ఎన్నికల తర్వాత టిడిపి నుంచి వైకాపాలో చేరిన ఆరుముగంశెట్టి ఇటీవల కాలంలో వైకాపాకు దూరంగా వున్నారు. ఈ నేపద్యంలో సోమవారం రాత్రి టిడిపిలో చేరారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తానని హామి ఇచ్చారు.

# తిరుపతి డివిజన్

## యువగళంకు భారీ సంఖ్యలో జనం

వడమాలపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్రకు వడమాలపేట మండలం నుంచి భారీ సంఖ్యలోనాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలి వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం పుత్తూరులో జరిగే బహిరంగ సభకు జనాలను తరలించడంలో నాయకులు కృషి చేశారు. లోకేష్ పాదయాత్రలో వైసీపీ పతనం ఖాయమని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛందంగా మహిళలు భారీగా పాల్గొనడం శుభ పరిణామమని, వైసీపీ గుండెల్లో గుబులు ప్రారంభమైందని అన్నారు. పాదయాత్ర బహిరంగ సభకు తరలివెళ్లిన నాయకులు అబ్బరాజు, వెంకటయ్య, మణిరాజు, దాముయాదవ్, ఉమాపతిరావు, లక్ష్మీప్రసన్న, హేమావతి, వెంకటేష్ యాదవ్, శేషాద్రియాదవ్, రవిరెడ్డి, రవినాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, దేవా, పెద్దబ్బరాజు, వెంకటేశ్వరరావు, ఉదయ్ యాదవ్, హేమాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రేపు శ్రీ సంత్ సేవాలాల్ 284వ జయంతి వేడుకలు

### -జయప్రదం చేయాలని బాలాజి నాయక్ పిలుపు

తిరుచానూరు,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

రేపటి రోజు 15వ తేదీ బుధవారం స్థానిక ఆర్‌సి.రోడ్డులోని గిరిజన భవన్ నందు ఉదయం 10 గంటలకు శ్రీ సంత్ సేవాలాల్ 284వ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ట్రైబల్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ బాలాజి నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ఈ జయంతి ఉత్సవాలలో తిరుపతి జిల్లాలోని బంజారా నాయకులు,బంజారా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు.

## అవినీతి రహిత పాలన "ఆమ్ ఆద్మీ పార్టీ"కే సాధ్యం

### నియోజకవర్గ ఇన్‌చార్జ్ విరూపాక్షి నవీన్‌కుమార్ రెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

అవినీతి రహిత పాలన ఆమ్ ఆద్మీ పార్టీకే సాధ్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విరూపాక్షి నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక అక్కగార్ల కాలనీలో సోమవారం ఆయన మహిళా సంఘాల సభ్యులకు ఆమ్ ఆద్మీ పార్టీ విధివిధానాలను వివరించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వం, పరిపాలన, సమర్ధతను ప్రజలకు వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధించడానికి 2024 సార్వత్రిక ఎన్నికలలో చీపురు గుర్తుపై ఓటు వేసి ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాలని కోరారు.

## పుల్లగుంటను కాపాడండి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:

పుల్లగుంటను కాపాడాలంటూ గ్రామస్థులు తహశీల్దార్ జి.సి.వెంక టేశ్వర్లును కోరుతూ వినతి పత్రం అందజేశారు. అనుపల్లి పంచాయతీ, గడ్డక్రిందపల్లి సమీపంలోని సర్వే నంబర్ 134/3లో గల పుల్లగుంటను ఓ వ్యక్తి ఆక్రమించుకుని గుంటను పూడ్చివేస్తున్నట్లు తెలిపారు. ఇందులో గడ్డక్రింద పల్లి ఏఏడబ్ల్యుకు 75 సెంట్లు భూమిని శ్మశాన వాటికకు కేటాయించినట్లు తెలిపారు. ఈ గుంట పశువుల దాహర్తిని తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఆక్రమణపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఘనంగా చార్లెస్ డార్విన్ జయంతి

రేణిగుంట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: జీవ పరిణామ సిద్ధాంతంను కనుగొన్న మహనీయుడు చార్లెస్ డార్విన్ జయంతి సందర్భంగా విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో సోమవారం రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల, బీసీ హాస్టల్‌లో విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓ వెంకటరమణ, సైన్సు టీచర్లు లావణ్య, విజయ, ఐద్వా నాయకులు సత్యశ్రీ, శివానందం, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌లు ప్రసంగించారు. చార్లెస్ డార్విన్ జీవపరిణామం సిద్ధాంతం నెబురల్ సెలెక్షన్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా ఓటర్ల జాబితాలో అవకతలను సరి చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల జాబితాలో ఒకటికి రెండఉ మార్లు పేర్లు నమోదుయ్యాయని వెంటనే పరిశీలించాల్సిందిగా సీపీఎం నేతలు ఓ.వి.రమణ, నరసింహారెడ్డి తదితరులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

## ఒరిగిన విద్యుత్ స్తంభానికి మరమ్మతులు

రేణిగుంట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

రేణిగుంట చెక్‌పోస్టు సమీపంలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయి పడిపోయే స్థితిలో ఉండగా రేణిగుంట సర్పంచ్ నాగేషం స్తంభాన్ని సోమవారం పంచాయతీ కార్మికులతో రిపేరు చేయించారు. పాత చెక్‌పోస్టు సమీపంలోని రామకృష్ణాపురం సర్కిల్ వద్ద సర్కిల్ గట్టుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగకపోయినా స్తంభం పక్కకు ఒరిగిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ నాగేషం పంచాయతీ సిబ్బందితో స్తంభానికి మరమ్మతులు చేయించారు.

## సిపిఎస్

## నారాయణవనంలో లోకేష్ పాదయాత్రకు జన నీరాజనం

నారాయణవనం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారం రాత్రి 9గంటలకు నగరి నియోజకవర్గం పుత్తూరు నుంచి సత్యవేడు నియోజకవర్గం నారాయణవనంలో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా టిడిపి నేతలతో పాటు సత్యవేడు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకొని భారీ గజమాల, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వాగతం పలికారు. సత్యవేడు నియోజకవర్గం ఏడు మండలాల చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మాజీ ఎమ్మెల్యే హేమలత, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, బీద రవిచంద్రయాదవ్, సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జీ హెచ్ హెలెన హేమలత, స్థానిక టిడిపి నేతలు ఎన్ భాస్కరన్, పి గిరిబాబు ఆధ్వర్యంలో లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి అంబేద్కర్ సర్కిల్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఇక్కడ పులివర్తి నాని, జెడి రాజశేఖర్, సుందరారమిరెడ్డిలు లోకేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం నారాయణవనం, కీళగరం, వెత్తలతడుకు వరకు పాదయాత్ర జరిగింది. వెత్తలతడుకులో విశ్రాంతికి యాత్రను ఆపారు. మంగళవారం ఉదయం 8గంటల నుంచి మళ్లీ పాదయాత్ర ప్రారంభంకానుంది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు హెచ్‌పి గ్యాస్ రవికుమార్, కెఎస్‌రవి, మునస్వామియాదవ్, ఇళంగోవన్‌రెడ్డి, తిరుమలైరెడ్డి, దానాపరశురామయ్య, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి పనులను తనిఖీ చేసిన కేంద్ర బృందం

ఐరాల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలో జరుగుతున్న వివిధ పనులను కేంద్ర ఉపాధిహామీ తనిఖీ బృందం తనిఖీ చేసింది. ఈమేరకు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలు నిర్వహిస్తున్న పనులను తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల పట్ల కేంద్ర బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈకార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ నిర్మలాదేవి, ఉపాధిహామీ ఏపీఓ సంధ్యారాణి, స్థానిక క్షేత్ర సహాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండుగలా రావివేప చెట్లకు వివాహం

చౌడేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

కళ్యాణము చూతము రారండంటూ రావివేపచెట్లకు నిర్వహించిన కళ్యాణోత్సవం చూపరులను మంత్ర ముగ్ధులను చేసింది.,,మండలంలోని చారాల పంచాయతీ జంగాలపల్లి రవి గత మూడేళ్ళక్రితం గ్రామ నడిబొడ్డులో గల రావివేపచెట్లకు రచ్చబండ ఏర్పాటు చేసి నాగులరాళ్ళను ప్రతిష్టించాడు. అప్పటి నుంచి యేటా వాటికి వివాహం చేస్తూవస్తున్నాడు. లోకం సుభిక్షంగా వుండాలనే వుద్దేశ్యంతోనే ప్రకృతికి సాక్షాలుగా నిలచిన చెట్లకు పెళ్ళి చేస్తున్నట్లు నిర్వాహకుడు రవి తెలిపాడు. తన కుటుంబ సభ్యులు, సోదరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కళ్యాణోత్సవంలో వేదపండితుడులచే శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ, ఉచిత భోజన వసతిలాంటి కార్యక్రమాలు జరిగాయి. గ్రామంతోపాటు చుట్టుపక్కలవారు వివాహ మహోత్సవానికి హాజరయ్యారు.

## స్పందన సమస్యలకు సత్వర పరిష్కారం - ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. పాత జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి స్పందన కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి మొత్తం సమస్యలపై 17 అర్జీలు అందగా వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

## డ్రైనేజీలో పడిన వృద్ధుని కాపాడిన మహిళా పోలీసులు

తిరుపతి క్రైం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

జిల్లా ఎస్పి పి. పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు దిశ మహిళా పోలీసులు మహిళల యొక్క భద్రత ధ్యేయంగా రద్దీ ప్రాంతాలలో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈస్ట్ దిశా ఫోర్స్ రైల్వే స్టేషన్ శ్రీనివాసం వైపు మూవింగ్ చేస్తున్న సమయంలో ఒక ముసలి ఆయన గాంధీ సర్కిల్ వద్ద రోడ్డు పక్కన నడుస్తూ పక్కనే ఉన్న డ్రైనేజ్‌లో పడిపోయాడు. మహిళా పోలీసులు వెంటనే పక్కనే వున్న షాప్‌లోని వ్యక్తుల సహాయంతో ఆ తాతను పైకి తీసి, ఫస్ట్ ఎయిడ్ చేసి 108 అంబులెన్స్‌కి ఫోన్ చేసి ఆసుపత్రికి పంపి సేవ చేసారు. ప్రజలు పోలీసులు యొక్క సేవలను అభినందించారు.

## శివయ్యకు పట్టు పంచెలు అమ్మవారికి పట్టు చీరలు

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దాతలు అందిస్తున్న వితరణలతో పునీతమౌతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం చెన్నైకు చెందిన దాతలు స్వామి అమ్మవార్లకు పట్టు చీరలు, పంచెలను అందించారు. లక్షలాది రూపాయల విలువ కల్గిన వస్త్రాలను ప్రతి ఏడాది అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు వాసులు ఎస్ నాగరాజు కుటుంబసభ్యులతో విచ్చేసి వితరణ అందించారు. స్వామి వారికి 20 పట్టు పంచెలు, అమ్మవారికి 16 పట్టు చీరలు అందించారు. వీటిని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు చొరవతో అందించారు. పట్టు చీరలు, పంచెలను వికె సాగర్‌బాబుకు అందించారు. వారిని వేదపండితులతో సత్కరించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ఇఒ మురళీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శుకబ్రహ్మాశ్రమం పీఠాధిపతికి ఆహ్వానం

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి తీరాన వెలసిన శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామికి సోమవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, పాలమంగళం రవి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పోలసామి స్వర్ణమూర్తిలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందించారు. ఒక రోజు తన ప్రసంగంతో భక్తులను పునీతులు చేయాలని కోరారు. వారికి పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి ఆశీర్వదించారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఆశీర్వదించారు.

## భోళాశంకరునికి రూ.1.36కోట్ల విలువైన అంబారీల వితరణ

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

శ్రీకాళహస్తీశ్వరునికి భక్తుల నుంచి విరాళాల వెల్లువ వస్తుంది. ఈ నేపథ్యంలో సోమవారం శివరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా నెల్లూరుకు చెందిన మల్లాడి బాలసుబ్రమణ్యం రూ.1.36కోట్ల విలువ కల్గిన వెండి అంబారీలను బహూకరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా అంజూరు తారక శ్రీనివాసులు గత ఏడాది మహాశివరాత్రి పర్వదినాన బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆయన ఇక్కడకు వచ్చిన అతిథులకు ఉచిత రీతిన స్వాగతించి సత్కరిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరునికి ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా వెండి అంబారీలను ఉపయోగిస్తున్నారు. ఇక్కడి ఆలయంలోస్వామి అమ్మవార్లకు వెండి అంబారిలకు బదులు తెల్లటి పెయింట్ పూసిన అంబారీల్లో ఊరేగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మల్లాడి బాలసుబ్రమణ్యం, మల్లాడి నాగేశ్వరరావు దంపతులు నిండుమనస్సుతో రూ.1.36కోట్ల విలువ చేసే రెండు వెండి అంబారీలను తయారు చేసి సోమవారం అప్పగించారు. వారికి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయంలో ప్రత్యేకపూజలు, ఆశీర్వచనాలు అందించారు. వారికి స్వామి

అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. దాతలు అందించిన అంబారీలను 16కాళ్ళమండపం వద్ద ఏర్పాటు చేసి అభిషేక గురుకుల్ రాజేష్, నిరంజన్‌గురుకుల్ వేదపండితులతో పూజలను ఆలయ ఇఒ వికెసాగర్‌బాబు జరిపించారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు సాధన మునస్వామి, ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్, వెంకటముని, దామోదరం, అలయ వేదపండితులు ఆంజనేయ శర్మ అవధాని, శ్రీపచ్చా, బాలసుబ్రమణ్యం, ఇతరులు సుబ్బారావు, నరసింహులు (నందా) భాస్కర్, పాలమంగళం రవి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాల్లో స్వామిఅమ్మవార్లు బంగారునగలతో కనువిందు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్యాంకు లాకర్లో ఉన్న స్వామిఅమ్మవార్ల బంగారు ఆభరణాలను బయటకు తీశారు. ఇఒ వికెసాగర్‌బాబు ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్లకు అలంకరించే బంగారు దండలు, వజ్రకిరీటాలు, మామిడిపిందెల దండ, స్వర్ణపాదుకలు, అమ్మవారి స్వర్ణాభరణాలతో ఉత్సవాల్లో భక్తులకు కనువిందు చేయనున్నారు. ఈసందర్భంగా బ్యాంకులో ఉన్న నగలను బయటకు తీసి అలంకరించేందుకు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నేడు..

2వ రోజు-14.02.2023

స్వామివారి ధ్వజారోహణము-దేవరాత్రి

ఉదయం.8ః30గం.లకు వెండి అంబారీ వాహనసేవ

(మాఘ బహుళ నవమి మంగళవారం మద్యాహ్నం 12ః30గం.నుంచి ధ్వజారోహణం

రాత్రి 8గం.లకు వెండి అంబారీ సేవ

ఉభయదాతలుః- శ్రీమతి బయ్యా నాగమ్మ అండ్ సన్స్, బహదూరుపేట, శ్రీకాళహస్తి,

-ధూర్జటి కళా ప్రాంగణంలో నేడుః-

14.02.2023 శ్రీస్వామి వారి ధ్వజారోహణము

సా.4గం.నుండి ః- టి.మురళీ, చిన్నగొట్టిగల్లు వారిచే భక్తిరంజని

సా.5గం.నుండి ః- పద్మశ్రీ ఘంటసాల కళాక్షేత్రం, సుంకర రవి కుమార్ గారిచే భక్తిరంజని

సా.6గం.నుండి ః- అష్టావధాన బ్రహ్మశ్రీ మేడసాని మోహన్ గారిచే ప్రవచన కార్యక్రమం

రా.7గం.నుండి ః- వర్ధమాన సినీ హీరోయిన్ మరియు సినీ కొరియోగ్రాఫర్ మహతిభిక్షు, హైదరాబాదువారిచే నృత్య ప్రదర్శన

రా.8గం.నుండి ః- సుషక్షబాణం అకాడమీ ఆఫ్ క్లాసికల్ డ్యాన్స్, చెన్నై సీతాలక్ష్మి వారిచే నృత్య ప్రదర్శన

రా.9గం.నుండి ః- వాసవీ కళానికేతన్,, బి.కేశవి, తిరుపతి వారిచే నృత్య ప్రదర్శన

రా.10గం.నుండి ః- పి.జ్యోతిర్మయి, శారద మ్యూజిక్ మరియు డ్యాన్స్ కాలేజీ, కర్నూలు వారిచే నృత్య ప్రదర్శన

రా.11గం.నుండి ః- శ్రీ నృత్య నికేతన్ భరతనాట్య అకాడమీ, విశాఖపట్నం వి.శ్రావణి వారిచే నృత్య ప్రదర్శన

రా.12గం.నుండి ః- శ్రీవిఘ్నేశ్వర నాట్యమండలి, నెల్లూరు మాతంగి నరసింహులు ఆధ్వర్యంలో గయోపాఖ్యానం నాటకం.

## ఇళ్ళ నిర్మాణ లబ్దిదారులకు సత్వరం రుణం

### - నిర్మాణాల్లో వెనుకబడ్డ మండలాలపై ప్రత్యేక శ్రద్ధ
### - కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యే దశలో వున్న లబ్దిదారులకు డిఆర్‌డిఎ, మెప్మా సిబ్బంది పరిశీలించి అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసి ఇళ్ళ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ హరినారాయణన్ సోమవారం ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 22,229 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యాయని, వివిధ దశల్లో వున్న ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడానికి రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రస్తుతం బిఎల్ స్థాయిలో 17,700, ఆర్‌సి స్థాయిలో 7,800 ఇళ్ళు వున్నాయని వీటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా రుణాలు తీర్చిన లబ్దిదారులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేసి ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. అలాగే జిడినెల్లూరు, పూతలపట్టు, పుంగనూరు, కుప్పం, నగరి నియోజకవర్గాల్లో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయడానికి అధికారులు పక్కా చర్యలు చేపట్టాలన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో లబ్దిదారులకు కేటాయించిన ప్లాట్లుగా విభజించి వెంటనే అప్పగించి వారితో నిర్మాణాలు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పిడి పద్మనాభం, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, హౌసింగ్ డిఇలు, ఎఇలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి!

### -డిస్కం సిజిఎం హెచ్‌ఆర్‌డి వరకుమార్

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

విద్యుత్ శాఖలో విధి నిర్వహిస్తున్న ఉద్యోగులు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారిని తిరిగి తీసుకురాలేము కానీ, క్షతగాత్రులయిన వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో రక్తం అవసరమయినప్పుడు మనం రక్తదానం చేసి ప్రాణదాతలు కావచ్చునని డిస్కం చీఫ్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్‌డి) వరకుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ రిజి.నెం: 1104 యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక ఎస్‌పిడిసిఎల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 1104 యూనియన్ డిస్కం సెక్రటరీ వి.దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరాన్ని వరకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 213 మంది ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కానీలోని ఎస్‌విఎస్‌సి బ్లడ్ బ్యాంకుకు అందించడం జరిగింది. చీఫ్ జనరల్ మేనేజర్లు లక్ష్మీనారాయణ (ఫైనాన్స్), ధర్మజ్ఞాని(రెవిన్యూ), ఏఏఓలు అంజనప్ప, నాగేశ్వరరావు, ఇంజనీర్లు కృష్ణారెడ్డి, వాసుదేవరెడ్డి, వాసురెడ్డి, 1104 యూనియన్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎం.పాండు రంగయ్య, కార్య నిర్వహణ అధ్యక్షుడు వెలగటూరి గోపి, డిస్కం ఉపాధ్యక్షుడు గిరిధర్‌నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, మురళి, చిత్తూరు జిల్లా 10 డివిజన్లకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## కల్యాణ వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జీ

నారాయణవనం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :

నారాయణవనంలో వెలసిన పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరున్ని హైకోర్టు జడ్జీ ప్రవీన్ కుటంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనికి ప్రత్యేకంగా దర్శనం కల్పించిన తర్వాత అర్చన, హారతులు పట్టారు. అనంతరం స్వామి వారి మహా ప్రసాదాన్ని అందించారు.

## ఆక్సలరీ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు పోలింగ్ స్టేషన్ల పేరు మార్పు

### - కలెక్టర్ వెంకట రమణారెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

గ్రాడ్యుయేట్, టీచర్స్, స్థానిక సంస్థల ఓటర్లు 1200 దాటిన పోలింగ్ కేంద్రాలలో అక్సలరీ పోలింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ఉన్న పోలింగ్ స్టేషన్ల ప్రస్తుత పేరును బట్టి పోలింగ్ స్టేషన్ల పేరు మార్పులు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లె ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు పూర్తయిందని, ఇప్పటివరకు అందిన ధరఖాస్తులను పరిశీలించి ఈనెల 23 నాటికి జాబితాను సిద్ధం చేయనున్నామని, అభ్యంతరాలు ఉంటే వ్రాతపూర్వకంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించాలని సూచించారు. నేడు వివిధ పార్టీలు అందించిన వినతులన పూర్తిస్థాయిలో పరిశీలించి ఎన్నికల కమీషన్‌కు నివేదించడం జరుగతుందన్నారు. డూప్లికేట్ ఓటర్ల తొలగింపు చేపట్టామని సూచించారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ ప్రతినిధులు వినతులన అందించారు. మార్చి 13న జరగనున్న పోలింగ్ సమయం వల్ల 1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలకు అనుబంధ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో నగరపాలక కమీషనర్ అనుపమ అంజలి, ఆర్డీఓలు కిరణ్‌కుమార్, సూళ్ళూరుపేట చంద్రముని, శ్రీకాళహస్తి రామారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్స్ కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, ఏఈఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## కీర్తీ పతాకం ఎగరవేసిన కుందనశ్రీ

గంగవరం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :

ఓ మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన కుందనశ్రీ(9) అనే చిన్నారి రాష్ట్ర స్థాయిలో జరిగిన చెస్ పోటీలలో ప్రథమ స్థాయిలో నిలిచి కీర్తీ పతాకం ఎగరవేసింది. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరంకు చెందిన సిపి బాలులేఖ్య దంపతుల కుమార్తె సిబి కుందనశ్రీ అనే చిన్నారి చిత్తూరులోని న్యూయార్క్ పాఠశాలలో ఈనెల 12న ఆల్ చిత్తూరు చెస్ డెవలప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి స్టేట్ ఓపెన్ రాఫిడ్ చెస్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానం సాధించినట్లు ఆల్ చిత్తూరు చెస్ డెవలప్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకున్న కుందనశ్రీను పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు, కుటుంబ సభ్యులు, అసోషియేషన్ సభ్యులు అభినందించారు. కుందనశ్రీ చెస్ పోటీలలోనే కాక అండర్ 11 క్రికెట్ ఆడుతూ జిల్లా స్థాయిలో ప్రశంసలు అందుకుంటుంది.

## సింహ వాహనంపై సిరిసంపదల దేవుడు

### భక్తజనుల గోవింద నామస్మరణ

చంద్రగిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

సింహ వాహనంపై సిరిసంపదల దేవుడు శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిస్తూ తిరుమాడవీధులలో విహరించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చారు. కళ్యాణ వెంకన్న ఉత్సవమూర్తిని వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి సింహవాహనంపై యోగ నరశింహస్వామి వారి అవతారంలో అధిష్టింపజేశారు. మూడవ రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మృగరాజును వాహనంగా చేసుకుని తిరుమాడ వీధులలో ఊరేగారు. ఆలయ కంకణభట్టార్ బాలాజీ రంగాచార్యులు వాహన విశేషాన్ని వివరిస్తూ సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతంగా నిలుస్తుందన్నారు. నిద్ర నుండి లేవగానే దర్శించుకునే వాటిలో ముఖ్యమైన సింహదర్శనం చేసుకోవడం ద్వారా శక్తులన్నీ చైతన్యవంతమవుతాయన్నారు. సోమరితనం నశించి పట్టుదలతో ప్రవర్తించి సర్వత్రా విజయులమై ఆధిపత్యంతో రాణించి స్ఫూర్తి సిద్ధిస్తుందన్నారు.



అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను నా వాహనమైన సింహము సమాన ప్రయత్నంతో వుంటామని ఈ వాహనసేవ ద్వారా స్వామివారు నిరూపిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు పార్థసారిధి, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

## భూత,సింహవాహనాలపై సోమస్కంధమూర్తి

తిరుపతి, ఫిబ్రవరి 13ప్రభాతవార్త:

తిరుపతిలోని శ్రీకపిలేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు సోమవారం ఉదయం సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారితో కలసి భూతవాహనంపై, రాత్రి సింహవాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించారు. పూర్వం క్రూరభూతాలు ప్రజలను బాధిస్తున్న సమయంలో పరమ శివుని బ్రహ్మదేవుడు ఆ భూతాల నుంచి లోకాలను కాపాడమని వేడుకున్నారు. ఈ కార్యానికి నిర్జన ప్రదేశాలైన శ్మశానాలను తన ఆవాసాలుగా చేసుకున్నాడు శివుడు. భూతాలను వశీకరించి శ్మశానాలలోఉంచి బ్రహ్మసృష్టిని రక్షిస్తున్నాడని, నాటినుండి భూతపతిగా కీర్తించే జీవులకు భయాలను తొలగించి శివుడు రక్షిస్తున్నాడని భక్తుల విశ్వాసం. ఉదయం స్వామివారికి, అమ్మవారికి విశేష అభిషేకం జరిగింది. రాత్రి స్వామివారు సింహవాహనాన్ని అధిరోహించి నగర పురవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ భూపతి ,ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారరు.